క్లుప్తంగా

జాతి అభివృద్ధికి కృషి చేయాలి



గుడాల బాబూరావును సత్కరిస్తున్న కార్పొరేటర్‌ లక్ష్మణరావు

సింథియా: పారిశ్రామిక ప్రాంత మాలమహానాడు ఆధ్వర్యంలో జాతి అభివృద్ధికి కృషి చేస్తున్న పలువురు దళిత నాయకులను దళిత రత్న మాటూరి చిన్నారావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. చిన్నారావు అధ్యక్షతన స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగ విరమణ చేసిన రావాడ అప్పారావు, గుడాల బాబూరావు, తన గళంతో చైతన్యం తీసుకువస్తున్న పెయ్యల సునీతను ఘనంగా సత్కరించారు. జాతి అభివృద్ధికి కృషి చేస్తున్న వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్‌ బల్ల లక్ష్మణరావు, నాయకులు బర్రె అప్పారావు, తంతటి సంపత్‌కుమార్‌, దేవాగాంధీ, పునుగు రమణ, ముంజేటి హనుమంతరావు, ఈదే మధుబాబు, సబ్బవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు, ఎంఈవో–2 దివాకర్‌

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఊర్వశి కూడలి దరి సుభాష్‌నగర్‌ ప్రభుత్వప్రాథమిక పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే పి.గణబాబు, గోపాలపట్నం ఎంఈవో–2 డి.దివాకర్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థుల గ్రేడింగ్‌, స్టార్‌ రేటింగ్‌, బోధనా ప్రమాణాలు, మౌలిక వసతులపై హెచ్‌ఎం రామ్‌ప్రసాద్‌, ఇతర ఉపాధ్యాయులతో చర్చించారు. మధ్యాహ్న భోజన పథకం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడే సమయంలో భోజనం వరండాల్లో తినేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సీజనల్‌ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పెంటకోట అజేయ్‌బాబు, ముర్రు వాణినానాజీ, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి



బీచ్‌రోడ్డు: రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్‌ రజక వృత్తిదారుల సంఘం సభ్యులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సమస్యలపై సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ విశాఖ జిల్లాలో రజక వృత్తిదారులు సుమారు 50 వేల మంది ఉన్నారన్నారన్నారు. వారికి పక్కా ఇళ్లు, ధోబీగాట్లు లేవని, లాండ్రీ పని చేయడానికి స్థలాలు లేవన్నారు. కుల వృత్తి చేసుకునే అవకాశం లేక నగరంలోని అపార్ట్‌మెంట్స్‌లో వాచ్‌మెన్‌గా, ఇంటి పనివారిగా చేస్తూ జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులపై అగ్రవర్ణాల దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, చీటింగ్‌ కేసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారన్నారు. వాటి నుంచి రక్షణ కోసం రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని కోరారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే రజక వృత్తిదారులంతా జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తారని హెచ్చరించారు.

అప్పన్న ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణ జయంతి

సింహాచలం: సింహగిరిపై సోమవారం శ్రీకృష్ణాష్టమి ఘనంగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని విశేషంగా జరిపారు. ఆండాళ్లమ్మ ఉత్సవమూర్తిని దేవకీదేవిగా అలంకరించి పల్లకిలో వేంజేపచేసి బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం దేవకీదేవిని బేడామండపంలో వేంజేపచేసి శ్రీకృష్ణ జననోద్ధారణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.



ఫౌంటైన్‌లో ప్రమాదకరంగా నీరు



సచివాలయం మేడపై మద్యం సీసాలు, గ్లాసులు



సచివాలయ భవనం పక్క మేడపై నిలిచిన వర్షపు నీరు

ఆ ప్రాంగణాలు దోమల వృద్ధి కేంద్రాలు!

- అలంకార ప్రాయంగా ఎన్‌ఏడీ జంక్షన్‌లోని ఫౌంటైన్‌
- నిలిచిన మురుగునీరు
- శాంతినగర్‌లో సచివాలయం భవనంపై నిలిచిన నీరు
- కార్యాలయాల్లో కానరాని డ్రైడే



శిథిలావస్థకు చేరిన వాటర్‌ ఫౌంటైన్‌

గోపాలపట్నం:

ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు దోమల తయారీ కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రతీ వారం జోనల్‌ అధికారులు డ్రైడే ఫ్రైడే అంటూ ప్రజల్లో అవగాహన పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అయితే వారు మాత్రం వాటిని పాటించరని విమర్శలు వినిపిస్తున్నాయి. జోన్‌–5 పరిధిలో పలు చోట్ల వర్షపు నీరు రోజుల తరబడి నిలిచి పోవడంతో దోమల లార్వా పెరుగుతోందని వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

52వ వార్డు శాంతినగర్‌ సామాజిక భవనంలోని సచివాలయం ప్రాంగణంలో ఉన్న భవనంపై వర్షపు నీరు నిలియిపోయింది. ఇందులో దోమలు గుడ్లు పెట్టి లార్వా వృద్ధి కేంద్రాలుగా మారుస్తున్నాయని వాపోతున్నారు. సచివాలయం ఉద్యోగులు ఈ నీటిని చూస్తున్నా పట్టించుకోక పోవడమేంటని విమర్శిస్తున్నారు. అలాగే ఈ సచివాలయం భవనంపై మందుబాబుల ఆగడాలు ఎక్కువవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు దృష్టిసారించి వీటిని కూడా నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

కళావిహీనం

ఎన్‌ఏడీ జంక్షన్‌ ఒకప్పుడు సాయంత్రం అయితే జిగేల్‌మనేది. పాదచారులు నడిచే సెంటర్‌ సర్కిల్‌లో వాటర్‌ఫౌంటైన్‌ కనువిందు చేసేది. దాని నిర్వహణను వదిలేయడంతో ఫౌంటైన్‌ అలంకార ప్రాయంగా మారింది. దీనిలో వర్షపు నీరు నిలిచిపోయి దోమల తయారీ కేంద్రంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.కనీసం వర్షా కాలంలో దోమలు పెగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇక్కడి వారు, ప్రయాణికులు కోరుతున్నారు. దోమల వల్ల కూర్చునే అవకాశం కూడా లేకుండా ఉందని వాపోతున్నారు.

భారీ అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కార్పొరేటర్‌ లక్ష్మణరావు, సీఐ అప్పారావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురం గ్రామంలో గణేష్‌ బాయ్స్‌ యూత్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్‌ బల్ల లక్ష్మణరావు, మల్కాపురం సీఐ గొలగాని అప్పారావుయాదవ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్ని దానాలు చేసిన రాని సంతృప్తి కేవలం అన్నదానం చేసినప్పుడు మాత్రమే వస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్‌, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్‌.సత్యనారాయణ, గణేష్‌ బాయ్స్‌ యూత్‌ ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవైష్ణవ కృష్ణ జన్మాష్టమి



ఉయ్యాల సేవలో ఆలయ అర్చకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ టౌన్‌షిప్‌లోని సెక్టార్‌–1 కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీవైష్ణవ శ్రీకృష్ణ జన్మాష్టమి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి వేకువ జామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సాయంత్రం ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, అర్చకులు మనోజ్‌స్వామి, హరి వెంకట నారాయణ స్వామి నేతృత్వంలో శ్రీకృష్ణ జననం, అభిషేకం, ద్వాదశార్చన, నివేదన అందజేశారు. అనంతరం మంగళశాసనం, ఊంజల్‌ సేవ (ఉయ్యాల సేవ)నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న డాక్టర్‌ సునీల్‌కుమార్‌

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలోని పాడి రైతులకు మేలు కలిగేలా నెల రోజులు పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు గాంధీ గ్రాం పశువుల ఆస్పత్రి వైద్యుడు డాక్టర్‌ సునీల్‌కుమార్‌ తెలిపారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి రోజు సుమారు 65 పశువులకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్‌ సునీల్‌కుమార్‌ మాట్లాడుతూ పశువులను వేధిస్తున్న అంటు రోగాల్లో మహా ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి వైరస్‌ ఒకటన్నారు. కలుషితమైన గాలి ద్వారా సోకే ఈ గాలికుంటు వ్యాధి ఒకప్పుడు మార్చి నుంచి సెప్టెంబర్‌ మాసాల మధ్య మాత్రమే సోకేదని, ఇటీవల ఏడాది పొడువునా పశువులు ఈ వ్యాధి బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. పశువులు తినే గడ్డి, మేత, కలుషితమైన గాలి ద్వారా, తల్లిపాల ద్వారా దూడలకు వ్యాప్తి చెందుతుందన్నారు. వైద్య బృందాలు రైతుల వద్దకు వచ్చినప్పుడు సహకరించి పశువులకు టీకాలు వేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఇంజినీర్స్‌ డే



విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ కళాశాలలో సోమవారం ఇంజినీర్స్‌ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ఈపీడీసీఎల్‌ ఆపరేషన్‌ డైరెక్టర్‌ టీవీ సూర్యప్రకాష్‌, ఏపీ టూరిజం ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఉమామహేశ్వరరావు, కళాశాల చైర్మన్‌ సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలను గుర్తు చేశారు. ఆయన ఆధ్వర్యంలో అద్భుత కట్టడాల గురించి వివరించారు. ఆయన జీవితం ఇంజినీరింగ్‌ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను అతిథులు తిలకించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌ భాస్కరరావు, ప్రిన్సిపాల్‌ ప్రదీప్‌, పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రసాద్‌, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వెలుగులు రోడ్డువైపు..

సాక్షి ఎఫెక్ట్‌..



విద్యుత్‌ లైటును రోడ్డువైపు మార్చుతున్న జీవీఎంసీ విద్యుత్‌ సిబ్బంది

గోపాలపట్నం: ఎన్‌ఎస్‌టీఎల్‌ ఫ్యామిలీ గేటు నుంచి వంటిల్లు వైపు వెళ్లే రోడ్డులో టైల్స్‌ దుకాణం వైపు మార్చిన వీధి లైటును రోడ్డువైపుజీవీఎంసీ విద్యుత్‌ శాఖ సిబ్బంది మార్చారు. ఇక్కడి టైల్స్‌ వ్యాపారి వీధి లైటును తన దుకాణం వైపు మార్చారని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుపై పడాల్సిన విద్యుత్‌ వెలుగులు తన దుకాణం వైపు మార్చుకున్న వైనాన్ని సోమవారం 'సాక్షి' దినపత్రికలో విద్యుత్‌ లైటు వెలుగులు ఎటు...? అన్న శీర్షికతో వార్త ప్రచురితమయింది. దీంతో జీవీఎంసీ అధికారులు స్పందించి వీధి లైటును రోడ్డు వైపు మార్చారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

పాదులు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్‌..



స్టాఫ్‌కాలనీ బస్టాప్‌ వద్ద మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద పాదులు తొలగిస్తున్న సిబ్బంది



పాదులు తొలగించిన తర్వాత షిప్‌యార్డ్‌ సర్కిల్‌ వద్ద స్తంభం



కమర్షియల్‌ కాంప్లెక్స్‌ వద్ద స్తంభానికి అల్లుకున్న పాదు తొలగిస్తున్న సిబ్బంది

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో షిప్‌యార్డ్‌ సర్కిల్‌ నుంచి నౌసేనాభాగ్‌ మార్గంలో విద్యుత్‌ స్తంభాలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ వద్ద పాదులు అల్లుకున్నాయి. దీనిపై సాక్షి దినపత్రికలో సోమవారం ట్రాన్స్‌కో ..మేలుకో అన్న శీర్షికన ప్రచురితమైన వార్తకు మల్కాపురం విద్యుత్‌ ఉపకేంద్రం అధికారులు స్పందించారు. విద్యుత్‌ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్‌పై అల్లుకున్న పాదులను తొలగించారు.

అదనపు బస్సులు ఏర్పాటు చేయండి

మహారాణిపేట: విశాఖ జిల్లాలో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు కోరారు. ఈ మేరకు జిల్లా కమిటీ తరఫున కలెక్టర్‌కు సోమవారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో సీనియర్‌ సిటిజన్లు, దివ్యాంగులు, పిల్లలు, విద్యార్థులు, పురుషులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాళ్లంతా గంటల తరబడి నిలబడి ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

వృక్ష విలాపం

- ఇష్టానుసారంగా చెట్ల నరికివేత
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు



చెట్లు నరికిన మోడులు



సంజీవయ్యనగర్‌లో రోడ్డుకు ఇరువైలా ఇలా..

గోపాలపట్నం: పచ్చని చెట్లను ఇష్టానుసారం నరికేస్తున్నారు. జంగిల్‌ క్లియరెన్స్‌ పేరిట కొమ్మలు తొలగించాల్సిన విద్యుత్‌ సిబ్బంది కొన్ని చోట్ల ఏకంగా మోళ్లు చేసేస్తున్నారు. ఇక నివాసీయులు, షాపుల వాళ్లు కూడా ముందు ఉన్న చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. ఇంటి లుక్‌ పాడవుతుందని, ఆకులు రాలుతున్నాయని చెట్లు నరికేందుకు యత్నించడం దారుణమైన చర్య అని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. ఎన్‌ఏడీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద మురుగన్‌ టవర్స్‌ వద్ద భారీ చెట్లు నరికేందుకు యత్నించారు. దీన్ని స్థానికులు అడ్డుకున్నారు. అలాగే మర్రిపాలెం వుడాలేఅవుట్‌ వద్ద భవనం లుక్‌ పాడు చేస్తుందని భావించిన యజమాని అశోక చెట్టును నరికేందుకు యత్నించారు. దీన్ని కూడా అడ్డుకున్నారు.

విద్యుత్‌ శాఖ అధికారుల తీరుపై విమర్శలు

విద్యుత్‌ తీగలకు అడ్డంగా ఉంటున్నాయనే నెపంతో చాలా చోట్ల చెట్లను మొదలకే నరి నరికేస్తున్నారని వాపోతున్నారు. నగర పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు పెంచిన మొక్కలను ఈ విధంగా తుంచేయడంపై పర్యావరణ ప్రేమికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మొదలు వరకు ఎందుకొడుతున్నారో అర్థం కావడం లేదని వాపోతున్నారు. విద్యుత్‌ తీగలకు అడ్డుగా ఉంటే కొమ్మలు కొట్టాలి. అలా కాకుండా ఏళ్ల తరబడి పెరగకుండా ఉండేలా మొదటికే నరికేయడం పర్యావరణానికి హాని కలిగించే చర్యలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ పద్ధతులు అన్వేషించాలి

చెట్లు తొలగించకుండా ప్రత్యామ్నాయ పద్ధతులు అన్వేషించాలని పలువురు కోరుతున్నారు. భూగర్భ విద్యుత్‌ కేబుళ్ల ఏర్పాటు చేస్తే చెట్లకు రక్షణ కలుగుతుందని చెబుతున్నారు. ఇకపై చెట్లను మొదలు వరకు కొట్టకుండా ప్రమాదాన్ని నివారించే స్థాయిలో కొమ్మల్ని మాత్రమే నరకాలని కోరుతున్నారు.



సంజీవయ్యనగర్‌లో రోడ్డుకు ఇరువైలా ఇలా..



మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో భవనం ముందు..

జోన్‌–5 పీజీఆర్‌ఎస్‌కు రెండే వినతులు



అర్జీదారుల వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జీవీఎంసీ జోన్‌–5 జ్ఞానాపురం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్‌)కు రెండే వినతులు వచ్చాయి. అర్జీదారుల నుంచి జోనల్‌ కమిషనర్‌ బొడ్డేపల్లి రాము వినతులను స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్‌ విభాగానికి –1, ఇంజినీరింగ్‌ విభాగానికి –1 చొప్పున వినతులు రాగా, ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌వోలు బాబురావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్‌ ఈఈలు తారా ప్రసన్న రెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్‌, విద్యుత్‌ లైట్ల ఏఈ అర్చన, వాటర్‌ ఏఈ సుమన్‌, టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ తిరుపతిరావు, టీపీవో ప్రవీణ్‌కుమార్‌, ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వో జనార్దనరావు, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఇంజనీర్లకు సత్కారం



జీవీఎంసీ ఇంజనీర్లను సత్కరించిన మేయర్‌, డిప్యూటీ మేయర్‌ ఇతరులు

దాబాగార్డెన్స్‌: ఇంజనీర్లు దేశ ప్రగతికి పునాది అని నగర మేయర్‌ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ ఇంజనీర్లను డిప్యూటీ మేయర్‌ దల్లి గోవిందరావుతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ ఇంజనీర్లను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య గొప్ప ఇంజనీరని, దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ ఫ్లోర్‌ లీడర్‌ బాణాల శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజనీర్‌ సంపత్‌కుమార్‌, కార్యనిర్వాహక ఇంజనీర్లు దిలీప్‌, మురళీకృష్ణతో పాటు పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.